క్లుప్తంగా

ఘనంగా మోదమాంబ జాతర



అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

రావికమతం: మండలంలో గదబపాలెం మోదమాంబ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. టి.అర్జాపురం, చిలకవానిపాలెంతోపాటు ఆరు ఆదివాసీ గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మడగల అర్జున ఆధ్వర్యంలో వీరికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సాయంత్రం వందలాది మంది మహిళలు సంబరంగా ఘటాలు తీసుకువచ్చారు. రాత్రికి ఆయా గ్రామాల్లో పలు వినోద కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

జల్‌జీవన్ మిషన్ పనులు రద్దు

మాకవరపాలెం: జల్‌జీవన్ మిషన్ నిధులతో సకాలంలో ప్రారంభించని పనులు రద్దయినట్టు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివారెడ్డి మంగళవారం తెలిపారు. మొదటి విడతగా మండలంలోని శెట్టిపాలెంలో జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేసేందుకు రూ.21 లక్షలు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులు మంజూరై ఏడాది దాటినా పనులు ప్రారంభం కాకపోవడంతో రద్దయ్యాయన్నారు. మళ్లీ కొత్తగా పనులు చేపట్టేందుకు టెండర్లు పిలుస్తారన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



చింతపాక-పిల్లవానిపాలెం జట్ల మధ్య పోటీ

రావికమతం: స్థానిక హైస్కూల్ ఆవరణలో ఉత్తరాంధ్ర స్థాయి మెగా వేసవి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రావికమతం యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి 62 జట్లు పాల్గొన్నాయి. లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ పోటీలను నిర్వహిస్తున్నారు. 8 ఓవర్లు మాత్రమే ఆడిస్తున్నారు. సోమవారం 8, మంగళవారం 7 జట్లకు పోటీలు నిర్వహించారు. చింతపాక-పిల్లవానిపాలెం జట్ల మధ్య పోటీ రసవత్తరంగా సాగింది.

కాలువ ఆక్రమణలపై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

రావికమతం: కొత్తకోటలో వెయ్యి ఎకరాలకు సాగునీరందించే ఇరిగేషన్ కాలువ (ఊరకాలువ) ఆక్రమణలను తొలగించాలని కొత్తకోట, కన్నంపేట గ్రామాల రైతులు గండ్రెడ్డి శంకరరావు, కోట సత్యనారాయణ, తదితరులు సోమవారం స్పందనలో కలెక్టరుకు, మంగళవారం స్థానిక తహసీల్దార్ మహేశ్వరరావుకు ఫిర్యాదులు చేశారు. సుమారు వెయ్యి ఎకరాలకు సాగునీరందించే ఈ కాలువ తరచూ పూడికపోతోందని వాపోయారు. నిత్యం పూడిక తీయాల్సి ఉందన్నారు. కాలువ గట్టును పలువురు ఆక్రమించి భవనాలు నిర్మిస్తుండటంతో పూడిక తీసేందుకు అడ్డంకి ఏర్పడుతుందన్నారు. ఈ దృష్ట్యా ఆక్రమణలు తొలగించి న్యాయం చేయాలని కోరారు.

వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శం



వలంటీర్ల సత్కార సభలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి

దేవరాపల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన గ్రామ/వార్డు వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక గ్రామ సచివాలయం-2లో సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మతో కలిసి ఆమె మంగళవారం ఉత్తమ వలంటీర్లను ఘనంగా సత్కరించారు. సేవా రత్న అవార్డులకు ఎంపికైన వరదపురెడ్డి రమ, పిల్లా రాజుకు 20 వేలు, సేవామిత్రకు ఎంపికైన వలంటీర్లకు రూ.10 వేలు, సర్టిఫికెట్, బ్యాడ్జి, మెడల్స్ అందజేశారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె. ఉషశ్రీ, పంచాయతీ సెక్రటరీలు ఎస్. శ్రీనివాసరావు, రత్నం, వీఆర్వో నాగేశ్వరావు, వార్డు మెంబర్లు దీవి శంకర్, కొల్లి ఈశ్వరరావు, బంధం అప్పలరాజు పాల్గొన్నారు.

పల్లె దారుల్లో రయ్ రయ్..!

- పూర్తయిన అప్పలరాజుపురం-కె.జె.పురం రహదారి
- చురుగ్గా వంటర్లపాలెం- ముకుందపురం బీటీరోడ్డు పనులు



గోతులమయంగా అప్పలరాజుపురం - కె.జె.పురం రహదారి (ఫైల్)



కొత్తగా నిర్మించిన కల్వర్టులతో కె.జె.పురం - అప్పలరాజుపురం బీటీరోడ్డు

మాడుగుల రూరల్: చీడికాడ, మాడుగుల మండలాలను కలిపే అప్పలరాజుపురం నుంచి కె.జె.పురం రోడ్డు అందుబాటులోకి వచ్చింది. గతంలో పెద్ద గోతులు, రోడ్డుకు ఇరువైపులా పేరుకుపోయిన తుప్పలతో అధ్వానంగా ఉండేది. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణాన్ని రూ.55 లక్షలతో ఇటీవల పూర్తి చేశారు. దీనికి నాలుగు చోట్ల ఇరువైపులా కల్వర్టులు నిర్మించారు. దాంతో మాడుగుల నుంచి చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు మండలాలకు ఈ రహదారి ప్రయాణం హాయిగా ఉంటుందని చెప్పవచ్చు. 17 సంవత్సరాల నుంచి రహదారి పూర్తిగా శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వం ఏనాడూ పట్టించుకున్న పాపానపోలేదని వాహనచోదకులు వాపోతున్నారు. ప్రస్తుతం నూతనంగా బీటీరోడ్డు నిర్మాణంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. డిప్యూటీ సీఎంకు కృతజ్ఞతలు చెబుతున్నారు. దీంతోపాటు వంటర్లపాలెం నుంచి ముకుందపురం గ్రామానికి రెండు కిలోమీటర్ల మేర బీటీరోడ్డు నిర్మాణానికి రూ.74 లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులు చురుకుగా సాగుతున్నాయి. వంటర్లపాలెం ప్రధాన కూడలి మర్రిచెట్టు నుంచి ముకుందపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు వరకు పనులు చేస్తున్నారు. ఈ రహదారిలో అవసరమైన చోట నాలుగు కల్వర్టులు నిర్మాణంలో ఉన్నాయి. తమకు పూర్తి స్థాయిలో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని రెండు గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రవాణా కష్టాలు గట్టెక్కాయి



వంటర్లపాలెం నుంచి ముకుందపురం గ్రామానికి కె.జె.పురం మీదుగా వెళ్లాల్సి వచ్చేది. రహదారి పూర్తిగా గోతులమయంగా ఉండేది. వర్షం వస్తే బురదలో ప్రయాణం సాగించేవాళ్లం. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు కృషితో ఈ రహదారి నిర్మాణం వల్ల మా కష్టాలు గట్టెక్కాయి.

– అల్లాడ నాగేశ్వరావు, సర్పంచ్, వంటర్లపాలెం

పేదలకు 'వైఎస్సార్ కంటి వెలుగు' వరం

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



వడ్డాదిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

బుచ్చెయ్యపేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వడ్డాది మేజర్ పంచాయతీలో ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. విశాఖకు చెందిన శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు హరిచందన రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి సమస్యలతో బాధపడుతున్న కోట్లాది మంది ప్రజలకు వైఎస్సార్ కంటి వెలుగు పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేసి, కళ్లద్దాలు అందించి వారికి చూపు ప్రసాదిస్తున్నారని విప్ ధర్మశ్రీ తెలిపారు. వడ్డాది, కొత్తూరు, చిన అప్పనపాలెం, బంగారుమెట్ట తదితర గ్రామాలకు చెందిన 103 మంది రోగులు పరీక్షించుకున్నారు. వీరిలో తీవ్ర దృష్టిలోపం ఉన్న 52 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేసి విశాఖకు తరలించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు దొండా సన్యాసిరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్ధనరావు, నాయకులు కోవెల ఈశ్వరరావు, పాలిమేర కాశి, వీర్ల సురేష్, సెక్రటరీ శాంతి, క్యాంప్ కో ఆర్డినేటర్ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుపై ఆర్డీవో విచారణ



విచారణ చేస్తున్న ఆర్డీవో చిన్నికృష్ణ

బుచ్చెయ్యపేట: పొట్టిదొరపాలెం గ్రామంలో ఫిర్యాదుదారు భూమిని అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ పరిశీలించారు. గ్రామానికి చెందిన అట్టా అమ్మాజీ తన పేరున భూమిని భూ రికార్డుల్లో వేరే వ్యక్తి పేరుపై వెబ్‌ల్యాండ్‌లో మార్పు చేయడంపై అనకాపల్లి కలెక్టరేట్‌లోని స్పందన కార్యక్రమంలో ఇటీవల ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఆర్డీవో మంగళవారం గ్రామానికి వచ్చి విచారణ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ మురళి పాల్గొన్నారు.

ప్రజాదరణ చూసి ఓర్వలేక టీడీపీ దుష్ప్రచారం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



ఎ.శరభవరంలో సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్

నాతవరం: వైఎస్సార్‌సీపీ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక టీడీపీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మి మోసపోవద్దని ప్రజలను ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎ.శరభవరంలో మంగళవారం ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ లబ్ధిపై వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రైనేజీ సమస్య అధికంగా ఉందని, వర్షం పడితే నీరంతా నిలిచిపోతోందని, తాగునీటి పథకం ట్యాంకు శిథిలమైందని కొత్తది నిర్మించాలని, ఇంటి స్థలాలు, ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యేను పలువురు గ్రామస్తులు కోరారు. వీటిపై ఎమ్మెల్యే స్పందించి నిబంధనల ప్రకారం పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీలు పైల సునీల్, మైనం శ్రీనాగగోపి, సర్పంచ్ కాళ్ల ఝాన్సీరాణి, ఎంపీటీసీ పల్లి భవాని, ఏఎంసీ డైరెక్టరు అడిగర్ల నాయుడు, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి వెంకటరమణ, గన్నవరం, పి.కె.గూడెం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జులు గొర్లె వరహాలబాబు, అచ్చెర్ల వరహాలబాబు, పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు, కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు శిరుసుపల్లి నర్సింగరావు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి సూకరాజు, సర్పంచులు లగుడు నాగేశ్వరరావు, ఉలబాల శ్రీను, జి.వి.రెడ్డి, సోమన్నదొర, ఇట్టంశెట్టి శ్రీను, మంకు సాంబమూర్తి, డిప్యూటీ తహసీల్దార్ చైన్లు, ఎంపీటీసీ పోలుపర్తి వెంకటరమణ పాల్గొన్నారు.

నేడు గడప గడపకు

బుధవారం కొత్తరామచంద్రపురం, బుచ్చెంపేట, లింగంపేట గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గణేష్ నిర్వహిస్తారని పార్టీ మండలాధ్యక్షుడు పైల పోతురాజు తెలిపారు.

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మేడివాడలో ప్రజల సమస్యలను వింటున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: నియోజకవర్గంలో ప్రతి సమస్యను పరిష్కరించడమే తమ ప్రభుత్వ ముందున్న లక్ష్యమని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. మేడివాడ గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఎవ్వరైనా లంచాలు అడుగుతున్నారా, ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఎస్సీ కాలనీలో యువకులు అంబేడ్కర్ విగ్రహ ప్రాంతం అభివృద్ధికి, రంగులు వేసేందుకు సహాయం చేయాలని కోరారు. దానికి ఆయన తన సొంత నిధులు రూ.10 వేలు అందించారు. 80 పశువుల పాకలు ఉన్న గొర్లె వారి పాకల వద్ద గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని మాజీ సర్పంచ్ రామారావు, రైతులు వినతి పత్రం అందించారు. గ్రామంలోని కొండపై వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. దానికి ప్రభుత్వ విప్ స్పందించి రూ.10 లక్షల టీటీడీ నిధులతో సదరు ఆలయాన్ని అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. అధ్వానంగా ఉన్న కాలువలు, సీసీరోడ్లను పునర్నిర్మించాలని ప్రధాన వీధిలో పలువురు మహిళలు ఆయన దృష్టికి తెచ్చారు. వీటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల రాజు, తహసీల్దార్ మహేశ్వరరావు, ఎంపీడీవో వెంకన్నబాబు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, ఎంపీటీసీ గొర్లె సత్యారావు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, మాజీ జెడ్పీటీసీ ఆళరి వాసుగోవిందరావు, కోఆపరేటివ్ సొసైటీ పర్సన్ ఇన్‌చార్జి కోటేశ్వరరావు, నాయకులు పతివాడ ధనంజయరావు, అమరపల్లి నర్సింగరావు పాల్గొన్నారు.

సంక్షేమ పాలన సీఎం జగన్‌కే సాధ్యం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



దిబ్బపాలెంలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: మహానేత వైఎస్సార్ తర్వాత తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే సంక్షేమ పాలన సాధ్యమని నిరూపించారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆయన దిబ్బపాలెంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ లబ్ధిని వివరించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా నూతన వాటర్ ట్యాంకు నిర్మాణానికి, ఇంటింటికీ కుళాయిల ఏర్పాటుకు రూ.96 లక్షలతో వెంటనే పనులు చేయాలని ఆదేశించారు. యూపీ స్కూల్‌లో నాడు-నేడు నిధులు రూ.26.30 లక్షలతో నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. 39 ఇళ్లకుగాను 11 విద్యుత్ మీటర్లు ఏర్పాటు, డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.20 లక్షలు కేటాయించామన్నారు. దివ్యాంగులను అక్కున చేర్చుకుని ఆర్థిక సాయమందించారు. ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మండల సచివాలయాల కన్వీనర్ ఈర్లె చైతన్య, దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, పార్టీ యూత్ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి స్వామినాయుడు, సీనియర్ నేతలు నందారపు అప్పారావు, దారపు రాము, గాడి ఈశ్వరఅప్పారావు, దారువ దేముళ్లనాయుడు, పెద్దాడ సూకునాయుడు, సలుగు అప్పలనాయుడు, పడాల అప్పలనాయుడు, చుక్కా అప్పలనాయుడు, కోన అర్జున, జగన్ పాల్గొన్నారు.

నేడు కట్టువానిఅగ్రహారం, దిబ్బపాలెంలో గడప గడపకు

దిబ్బపాలెం, కట్టువాని అగ్రహారంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు బుధవారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. ఉదయం 6.30 గంటలకే కట్టువాని అగ్రహారంలో పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

చోడవరం ఇన్‌చార్జి ఎంఈవోగా రవీంద్రబాబు

చోడవరం రూరల్: ఇన్‌చార్జి ఎంఈవోగా సిహెచ్. రవీంద్రబాబు నియమితులయ్యారు. గత ఏప్రిల్ 27న చోడవరం ఎంఈవో ఎస్.శ్రీనివాసరావు ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. అనకాపల్లి డీఈవో సూచనతో వి.మాడుగుల ఎంఈవో బి.దేముడమ్మకు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ గతంలోనే ఉత్తర్వులు జారీ చేశారు.

ఈ బాధ్యతలు స్వీకరించడానికి ఆమె నిరాశక్తత వ్యక్తం చేయడంతో తాజాగా దేవరాపల్లి ఎంఈవో రవీంద్రబాబుకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ విశాఖపట్నం జోన్ పాఠశాల విద్య ప్రాంతీయ డైరెక్టర్ ఎం.జ్యోతికుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పీహెచ్‌సీల్లో మానసిక రుగ్మతలకు చికిత్స

మానసిక వైద్య నిపుణురాలు శ్వేత



అవగాహన కల్పిస్తున్న మానసిక వైద్య నిపుణురాలు శ్వేత

కె.కోటపాడు: మనోవైకల్యం సమస్యతో ఇబ్బందులు పడుతున్న వారికి పీహెచ్‌సీల్లో ప్రతి నెలా రెండో బుధవారం వైద్య సేవలందిస్తున్నట్లు మానసిక వైద్య నిపుణురాలు జి.శ్వేత తెలిపారు. మనోవైకల్య దినం సందర్భంగా మంగళవారం చౌడువాడ పీహెచ్‌సీలో మానసిక రోగులకు ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనోవైకల్య సమస్యతో ఇబ్బందులు పడే వారు ప్రధానంగా తనలో తాను మాట్లాడుకోవడం, అనుమానం, భయం, నిద్రలేమితోపాటు ఆందోళన, నిస్సహాయత, ఎవరో తనను చంపుతారన్న భయాందోళనలకు గురయ్యే పరిస్థితి ఉంటుందన్నారు. ఇటువంటి లక్షణాలు ఉన్నవారు వెంటనే మానసిక వైద్య నిపుణులను సంప్రదించి వైద్యం పొందితే ఈ సమస్య నుంచి అధిగమించవచ్చునని సూచించారు. సమావేశంలో చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల, ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్, మానసిక సామాజిక కార్యకర్త మధులత పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంలో రైతులకు ప్రోత్సాహం



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనర్ వరలక్ష్మి

మాకవరపాలెం: ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య పెరగడమే లక్ష్యంగా పనిచేయాలని ఏవో చిరంజీవి సంబంధిత సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక వెలుగు కార్యాలయంలో నర్సీపట్నం డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ప్రకృతి సేద్య సిబ్బందితో ఏవో సమీక్షించారు. ఈ సందర్భంగా వచ్చే ఖరీఫ్ లక్ష్యాలపై చర్చించారు. రైతులు ప్రకృతి సేద్యంపై ఆసక్తి చూపాలని, తద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించొచ్చని పేర్కొన్నారు. అనంతరం మాస్టర్ ట్రైనర్లు వరలక్ష్మి, రామలక్ష్మి సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నవధాన్యాల సాగు-నేలతల్లి బాగు కార్యక్రమంలో 30 రకాలకు సంబంధించిన 12 కేజీల విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తామన్నారు. వీటిని తొలకరి ప్రారంభంలో వరి పండించే పొలాల్లో చల్లుకోవాలన్నారు. అనంతరం వచ్చిన మొక్కలను దుక్కుల్లో కలియదున్నుకోవడం ద్వారా భూసారం పెరుగుతుందన్నారు. వెలుగు ఏపీఎం చినబాబు, మాస్టర్ ట్రైనర్లు సుదర్శన్, సత్యనారాయణ, ఆరు మండలాల సిబ్బంది పాల్గొన్నారు.

వడ్డాది జగనన్న కాలనీలకు విద్యుత్ సరఫరా



డీపీని, విద్యుత్ సరఫరాను పరిశీలిస్తున్న అధికారులు

బుచ్చెయ్యపేట: వడ్డాది జగనన్న కాలనీల్లో విద్యుత్ సదుపాయం కల్పించారు. ఇక్కడ మూడు లేఅవుట్లను ఏర్పాటు చేశారు. లబ్ధిదారులకు విద్యుత్ సదుపాయం కల్పించేలా ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు మీటర్లు ఏర్పాటు చేశారు. వీటిని ఆ శాఖ ఈఈ పి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఈఈ కాశిబాబు, ఏఈ రమణారావు, ఏఈఈ సోమరాజు తదితర్లు మంగళవారం పరిశీలించారు.

రైతులకు భూహక్కు పత్రాల పంపిణీ



గాదిరాయిలో భూహక్కు పత్రాలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: సన్న, చిన్నకారు రైతులకు రానున్న కాలంలో ఎటువంటి భూ సమస్యలు రాకుండా ఉండటానికే జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు అందజేస్తున్నామని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ అన్నారు. మంగళవారం గాదిరాయిలో 642 మంది రైతులకు జగనన్న శాశ్వత భూహక్కు పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్తిస్థాయిలో సర్వే చేసి హద్దులు మ్యాప్‌లతో జగనన్న భూహక్కు పత్రాలు రైతులకు అందజేయడం వల్ల ఇకపై భూ సమస్యలు తలెత్తకుండా ఉంటాయన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రైతులకు ఉచితంగా భూహక్కు పత్రాలు అందజేయడం దేశ చరిత్రలో ఎక్కడా లేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రైతులంతా రుణపడి ఉంటారన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు పర్రే రామునాయుడు, నాయకులు పర్రే రమణ, గర్రెడ్డి వెంకట స్వామినాయుడు, ఆదాడ నాయుడు, మల్లునాయుడు, వీఆర్వో రాము, సచివాలయ కార్యదర్శి వెచ్చా రమేష్ పాల్గొన్నారు.

వలంటీర్ల వల్లే లబ్ధిదారులకు శతశాతం న్యాయం



వలంటీర్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్



ఎమ్మెల్యేగా గెలుపొంది నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న గణేష్

గొలుగొండ: వలంటీర్లు, గ్రామ సచివాలయం వ్యవస్థ వల్ల అర్హులందరికీ సంక్షేమ పథకాలు శతశాతం అందిస్తున్నామని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా రావణాపల్లి గ్రామ సచివాలయంలో ఉత్తమ వలంటీర్లను ఆయన ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యేగా పెట్ల ఉమాశంకర్ గణేష్ గెలిచి మంగళవారంతో నాలుగు సంవత్సరాలు పూర్తి కావడంతో కేక్ చేసి చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. అనంతరం మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలు 25,442 ఓట్ల మెజార్టీతో గెలిపించారని, వారికి రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం ఏఎంసీ చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు లోచల సుజాత, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, ఏఎంసీ చైర్మన్ సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా ప్రమాణాలు పాటించాలి

నాతవరం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అనేక జాగ్రత్త చర్యలు చేపడుతుందని, వాటిని ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలని ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కోరారు. నర్సీపట్నం – తుని ఆర్‌అండ్‌బీ రోడ్డుపై శరభవరంలో మంగళవారం వైఎస్సార్ క్రాంతి పథం (డీఆర్డీఏ) ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం దృష్టికి దేవదాయ భూ సమస్య



డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సన్మానిస్తున్న సర్పంచ్ దొరబాబు, గ్రామస్తులు

కె.కోటపాడు: లంకవానిపాలెం సర్పంచ్ వేచలపు దొరబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం దేవరాపల్లి మండలం తారువలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. తమ గ్రామంలో దేవదాయ భూముల సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ విన్నవించారు. దాంతో సదానంద విజయ కేశవ దేవస్థానం ఈవో శ్రీనివాస్‌తో మాట్లాడి చర్యలను తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమస్యను కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని డిప్యూటీ సీఎం భరోసా ఇచ్చారు. దీంతోపాటు గ్రామంలో పూర్తిస్థాయి మౌలిక వసతుల కల్పన, జలజీవన్ మిషన్ నిధులతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం డిప్యూటీ సీఎంను దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఉప సర్పంచ్ కె.లక్ష్మి, వార్డు మెంబర్లు కె.చిన్నమ్ములు, వర్రి రమణమ్మ, కె.స్వామినాయుడు, కె.దేవి, కనకమహలక్ష్మి పాల్గొన్నారు.